
నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, శనివారం 30 నవంబర్ 2024 | KAMAREDDY



దీక్షాదివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, వేదికపై మాజీ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, జడ్పీ మాజీ చైర్మన్లు దఫేదార్ రాజు, శోభ, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ తదితరులు



కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గంప గోవర్ధన్, ముజీబుద్దీన్, దఫేదార్ రాజు దంపతులు, బీఆర్ఎస్ నేతలు


# కేసీఆర్ స్ఫూర్తితో పోరాడాలి

- కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి
- కేసీఆర్‌తోనే తెలంగాణ ఏర్పాటు
- ఆయన ఆనవాళ్లను ఎవరూ చెరపలేరు
- పార్టీని మోసగించిన వారిని తరిమికొట్టాలి
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- ఘనంగా దీక్షాదివస్ కార్యక్రమం
- వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

కామారెడ్డి, నవంబర్ 29:తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ అవిశ్రాంత పోరాటం చేశారు. ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్, బీజేపీలపై పోరాడాలని, ఆ పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయాలని కాంగ్రెస్, బీజేపీ యత్నిస్తున్నాయని, ఆయన ఆనవాళ్లను ఎవరూ చెరపలేరని స్పష్టం చేశారు. స్వార్థం కోసం తల్లిలాంటి బీఆర్ఎస్‌ను వీడిన నాయకులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో దీక్షాదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమ ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, జడ్పీ మాజీ చైర్మన్లు దఫేదార్ రాజు, శోభ తదితరులు నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఉన్న తెలంగాణ తల్లి, కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి, అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యకన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన దీక్షాదివస్ కార్యక్రమంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమంలో భాగంగా కేసీఆర్ చేసిన పోరాట గాథను డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించారు. అమరులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## తరిమికొట్టాలి..

తల్లి లాంటి పార్టీని మోసం చేసిన వారిపై తిరుగుబాటు చేసి తరిమికొట్టాలని దీక్షా దివస్ కార్యక్రమ ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోయిందని అన్నారు. ఇప్పుడు ఇక్కడున్న వారిని చూస్తే బీఆర్ఎస్ పార్టీ అంటే ఏమిటో అని తెలుస్తుందన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు ఎవరూ కూడా తీసేయలేరని స్పష్టం చేశారు. పోచారం కాంగ్రెస్‌లోకి వెళ్లినప్పుడు పార్టీ పనైపోయిందని అన్నావు కదా.. ఈ దీక్షా దివస్‌కు మీ బాన్సువాడ నుంచే 500 మంది వచ్చారు. కాంగ్రెస్, బీజేపీ కూటమిగా మారి బాన్సువాడ కార్యకర్తలను ఈ సమావేశానికి రాకుండా చిత్రహింసలకు గురి చేసినా మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ ఆధ్వర్యంలో 500 మందికి పైగా కార్యకర్తలు తరలిరావడం అభినందనీయమన్నారు.



భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై కేసీఆర్ పోరాటాల డాక్యుమెంటరీ ప్రదర్శన

## ఉద్యమ గడ్డ కామారెడ్డి

తాను ఇక్కడికి పరిశీలకుడిగా కాకుండా విద్యార్థిలాగా వచ్చానని చెప్పారు. నాయకుల పోరాట పటిమ నుంచి స్ఫూర్తిని నింపుకోవడానికి వచ్చాన్నారు. కామారెడ్డి గడ్డ ఎన్నో ఉద్యమాలకు పురిటి గడ్డ అని అన్నారు. తెలంగాణ రావడానికి మూల కారకుడైన పోరాట యోధుడు కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అయితే జైత్రయాత్ర లేదంటే కేసీఆర్ శవయాత్ర అని నవంబర్ 29వ తేదీ నాడు ఆమరణదీక్షకు పూనుకున్నాడని తెలిపారు. తెలంగాణ కోసం ఎంతో మంది పోరాటాలు చేసినా రాష్ట్రం మాత్రం సాధించలేక పోయారని, కానీ కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణను సాధించాడని చెప్పారు. కేసీఆర్ త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపైనా ఉందన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి..

కేసీఆర్‌ను లొంగదీసుకునేందుకు ఎన్నో కుట్రలు పన్నారు. కల్వకుంట్ల కవితపై దొంగ కేసులు పెట్టి జైలుకు పంపితే కేసీఆర్ లొంగుతాడని భావించారు. అయినా కేసీఆర్ లొంగలేదని గుర్తు చేశారు. ఎన్నో కుట్రలు, అవమానాలను ఎదుర్కొని తెలంగాణను సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఆయన త్యాగం చేయకుంటే ఈ రోజుకూ తెలంగాణ వచ్చేది కాదన్నారు. దేశంలోనే గొప్పగా పాలించిన పరిపాలనాదక్షుడు కేసీఆర్ అని ప్రశంసించారు. బంగారు తెలంగాణ ప్రమాదంలో ఉందని, దీనిని కాపాడుకోవాలని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న కుట్రల గురించి ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్టీకి ద్రోహం చేసి వారి గురించి కూడా తెలియజేయాలన్నారు. ప్రతి కార్యకర్తకూ బీఆర్ఎస్ అండగా ఉంటుందని, అక్రమ కేసులకు ఎవరూ భయపడాల్సిన పని లేదన్నారు. కేటీఆర్ ప్రశ్నించకపోతే రేవంత్‌రెడ్డి రూ.12,300 కోట్లను అదానీకి అప్పనంగా అప్పగించే వాడని చెప్పారు.



ఎల్ఈడీ స్క్రీన్‌పై కేసీఆర్ పోరాటాల డాక్యుమెంటరీని చూస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



## విద్యార్థుల ఆత్మబలిదానాలకు చలించిన కేసీఆర్..

విద్యార్థుల ఆత్మబలిదానాలకు చలించిపోయిన కేసీఆర్ ఆమరణ దీక్షకు దిగారని జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అన్న పంతంతో ఆయన చేపట్టిన దీక్షతో తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందన్నారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం అర్పించేందుకు సిద్ధమైన కేసీఆర్ గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ అన్నారు. కేసీఆర్ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ అరాచకాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సబ్బండ వర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దేనని బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ అన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో పోచారం శ్రీనివాసరెడ్డికి మంత్రిగా, స్పీకర్‌గా అవకాశమిచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పోచారం వ్యక్తిగత అవసరాల కోసం బీఆర్ఎస్‌ను వీడారని మండిపడ్డారు. బాన్సువాడలో పోచారం కుటుంబ సభ్యులు మాత్రమే కాంగ్రెస్‌లో చేరారని, కార్యకర్తలు మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, బీఆర్ఎస్ నేతలు వేణుగోపాల్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, నల్లవెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



## తెలంగాణను కాపాడుకోవాలి..

తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చి బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. దీంతో కేసీఆర్ 2009 నవంబర్ 29న ఆమరణ దీక్షకు దిగారు. సీమాంధ్ర నేతలు, పోలీసులు భగ్నం చేయాలని ఎంత ప్రయత్నించినా ఆయన పట్టు వీడలేదు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్ష కొనసాగించారు. కేసీఆర్ దీక్ష మూలంగా తెలంగాణ అగ్నిగుండంగా మారుతుండడంతో కాంగ్రెస్ పార్టీ దిగొచ్చి తెలంగాణ ఏర్పాటు చేస్తామని డిసెంబర్ 9న ప్రకటించింది. కానీ సీమాంధ్రుల ఒత్తిడికి కాంగ్రెస్ పార్టీ తలొగ్గడంతో కేసీఆర్ మరోసారి ఉద్యమబాట పట్టారు. కులమతాలకు అతీతంగా సబ్బండ వర్ణాలను ఏకం చేసి తెలంగాణను సాధించారు. పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశారు. కానీ, కాంగ్రెస్ రావడంతో పరిస్థితి మారిపోయింది. తెలంగాణను కాపాడుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉంది. కేంద్రంలో బీజేపీ 11 ఏండ్లుగా అధికారంలో ఉన్నా తెలంగాణకు ఇచ్చిందేమీ లేదు. కానీ పదేండ్లలో కేసీఆర్ ఎన్నో ప్రాజెక్టులను కట్టారు. ప్రపంచ పటంలో తెలంగాణకు చోటు దక్కేలా చేశారు. గజ్వేల్ సభలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని అభినందించిన ప్రధాని మోదీ ఇప్పుడు మాట మార్చుతారా? అని నోరా.. మోరా? తెలంగాణలో అన్ని వర్గాలకు న్యాయం చేసిన వ్యక్తి కేసీఆర్. పల్లెలు, పట్టణాల్లో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ వాళ్లకు కనిపిస్తలేదా? లేనిపోని ఆరోపణలతో బీఆర్ఎస్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. సంక్షేమ పథకాలంటూ అర్రాసు పాట పాడి, మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారు. రేవంత్‌రెడ్డి అసలు ఏమాత్రం హుందాతనం లేని సీఎంలాగే కనబడడం లేదు. ఎన్నికల ముందర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాల్సిందే. అప్పటిదాకా బీఆర్ఎస్ తరపున కాంగ్రెస్‌ను నిలదీస్తూనే ఉంటాం.

**- గంప గోవర్ధన్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే**



## తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే..

తెలంగాణకు నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయే. 1600 మంది విద్యార్థులను బలిగొన్న పార్టీ అది. తెలంగాణ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. 2009 నవంబర్ 29 చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది. కేసీఆర్ తీసుకున్న నిర్ణయం దేశ రాజకీయ నేతలందరి దృష్టిని తెలంగాణ వైపు తిప్పింది. కేసీఆర్ తన ఆమరణ దీక్షతో కేంద్రం దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు. అందుకే 29వ తేదీన దీక్షాదివస్ నిర్వహిస్తున్నాం. ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన త్యాగాలను, కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాకపోతే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవాడా? మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పలేక అధికారం కోల్పోయాం. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది.

**- జాజాల సురేందర్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే**



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు

# ఎమ్మెల్యే మోసం చేసిండు

- కష్టపడ్డ వారికి పదవులు ఇచ్చారన్నది అబద్ధం
- పరీక్ష పెట్టలేదు, ఇంటర్వ్యూ చేయలేదు
- డబ్బులు తీసుకుని పదవులు కట్టబెట్టింండ్రు
- జుక్కల్ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నేత ఖండేరావు విమర్శలు



బిచ్కుంద, నవంబర్ 29: జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మోసగాడు, అబద్ధాల కోరు అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పెద్ద ఏడ్గి మాజీ సర్పంచ్ ఖండేరావు విమర్శించారు. ఎమ్మెల్యే సొంత పార్టీ నేతలు, కార్యకర్తలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం సోషల్‌మీడియాలో ఓ వీడియో విడుదల చేశారు. మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీకాంతారావు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తానని ఆశ పెట్టి తన వెంట తిప్పుకున్నాడని తెలిపారు. తనకు కాకుండా, పార్టీలో ఉన్న సీనియర్లకు కాదని వేరే ఎవరికో పదవు ఇచ్చారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఉండే సౌజన్యకు డబ్బులు తీసుకుని పదవి ఇచ్చారన్నారు. చైర్మన్ పదవి కోసం ఎలాంటి పరీక్షలు గానీ, ఇంటర్వ్యూలు గానీ నిర్వహించలేదని, అలా చెప్పడం బూటకం, నాటకమేనన్నారు. ఒకవేళా పరీక్షలు పెడితే మాకు కూడా పెట్టాలి కదా? అని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ పదవులపై ఎన్నెన్నో పుకార్లు వస్తున్నాయని, వాటిని కప్పిపుచ్చుకోవడానికే పరీక్ష అని సాకు చెప్పారని, ముందుగా కమిట్‌మెంట్ అయిన వారికే పదవులు ఇచ్చారని విమర్శించారు. పైగా యువతను ప్రోత్సహిస్తా, కాంగ్రెస్ కోసం కష్టపడిన వారికే పదవులు అనడం పచ్చి అబద్ధమన్నారు. లక్ష్మీకాంతారావుకు ఎమ్మెల్యే టికెట్ రాకముందు నుంచే ఆయన కోసం కష్టపడ్డానన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్తానని మాట ఇస్తే తన భార్య పుస్తెలతాడు తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులను ఖర్చు పెట్టానని చెప్పారు. కానీ తనతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలను ఎమ్మెల్యే దారుణంగా మోసం చేస్తున్నాడని విమర్శించారు.

# ఉద్వేగం.. ఉత్సాహం..

- దద్దరిల్లిన దీక్షాదివస్ ప్రాంగణం
- అనుభవాలు పంచుకున్న ఉద్యమకారులు
- ఉమ్మడి జిల్లాలో దీక్షాదివస్ విజయవంతం
- హోరెత్తిన జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలు



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

నిజామాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ సాధన కోసం 2009 నవంబర్ 29న ప్రాణాలను పణంగా పెట్టి.. ఆమరణ నిరాహార దీక్షకు కేసీఆర్ పూనుకున్న అపూర్వఘట్టానికి 15 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సన్నివేశానికి గుర్తుగా బీఆర్ఎస్ పార్టీ ఆదేశాలతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాకేంద్రాల్లో గులాబీ సైన్యం శుక్రవారం దీక్షాదివస్‌ను ఘనంగా నిర్వహించింది. మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో విజయవంతంగా కార్యక్రమాలు జరిగాయి. నిజామాబాద్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు హాజరయ్యారు. కామారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ అధ్యక్షుడు ముజీబుద్దీన్, మాజీ విప్ గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జడ్పీ మాజీ చైర్మన్లు దఫేదార్ రాజు, దఫేదార్ శోభ పాల్గొన్నారు. వీరితో పాటు వేలాది మంది గులాబీ సైనికులు, ఉద్యమకారులు పాల్గొన్నారు. కేసీఆర్ 2001లో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ పోరాట ఘట్టాలపై కామారెడ్డిలో డాక్యుమెంటరీ ప్రదర్శన జరిగింది. ఆ వీడియో చూస్తున్నంత సేపు సభికులందరూ ఉద్వేగానికి గురయ్యారు. నిజామాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల అనుభవాల సమాహారం జరిగింది. ఇలా దీక్షాదివస్ ఆద్యంతం ఉద్వేగం, ఉత్సాహం మధ్య కొనసాగింది.

## పిడికిలి బిగించిన గులాబీ సైన్యం..

తెలంగాణ ఉద్యమ చరిత్రను చెరిపేసేందుకు అనేక కుట్రలు నడుస్తున్నాయి. రాష్ట్రంలో పదేళ్ల కిందటి పరిస్థితులు ఉత్పన్నం అవుతున్నాయి. అవే నిర్బంధాలు, అణచివేతలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మళ్లీ ఆనాటి ఉద్యమస్ఫూర్తిని దీక్షాదివస్ రగిలించింది. అవిశ్రాంతంగా పోరాటం చేసిన ఉద్యమకారులంతా దీక్షాదివస్‌తో మరో సంకల్ప దీక్షకు సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చారు.

## గజ్జె గల్లుమన్నది..

చాలా రోజుల తర్వాత తెలంగాణ సాంస్కృతిక సందడి మార్మోగింది. జానపద పాటలతోపాటు పదేండ్ల కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై వచ్చిన పాటలు సైతం ఉర్రూతలూగించాయి. కాంగ్రెస్ వైఫల్యం కారణంగా దాపురించిన పరిస్థితులను కండ్లకు కట్టినట్లుగా కొనసాగాయి.